సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు ఇంటింటా అవగాహన కల్పించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అధికారులతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వాతావరణం మార్పుల వల్ల కలిగే డయేరియా, మలేరియా, డెంగీ జబ్బుల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు డయేరియా, మలేరియా, డెంగీ బారిన పడకుండా అవగాహన కల్పించే విధంగా డోర్ టు డోర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నగర వాసుల నుంచి డయేరియా సంబంధిత ఫిర్యాదులను స్వీకరించేందుకు వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంచాలని చెప్పారు. అందుకు అనుగుణంగా సిబ్బందిని మూడు షిఫ్టులలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ రూంకు ఫిర్యాదు వచ్చిన వెంటనే సమస్య పరిష్కారం అయ్యేలా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు. నగరవాసులు డయేరియా, మలేరియాపై ఫిర్యాదులు చేయటానికి వాట్సాప్ నంబరు 8181960909, లేదా 0866-2422515; 0866-2427485, 0866-2424172; 0866-2422400 ఫిర్యాదు చేసేలా ప్రచారం చేయాలని సూచించారు.



అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నీరు కలుషితంగా కాకుండా చర్యలు...

ప్రతి సర్కిల్లో తాగునీరు ఎక్కడ కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు తీసుకుంటూ నీటి నమూనాలు సేకరిస్తూ నిరంతరం పరీక్షలు నిర్వహిస్తూ కేవలం స్వచ్ఛమైన నీరుని ప్రజలకు అందేటట్టు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజన్లలోని సైడ్ డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు పూడికలను శుభ్రపరుస్తూ తాగునీటి పైపులు ఎట్టి పరిస్థితుల్లో కలుషితం కాకుండా చూడాలన్నారు. దోమ కాటు వల్ల వ్యాపించే మలేరియా, డెంగీ సోకకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు (ఏఎల్‌వో), అవసరమైన ప్రతిచోట ఎంఎల్ ఆయిల్ స్ప్రేను, నీటి నిల్వలు లేకుండా కృషి చేయలని కోరారు. అవసరమైతే మలేరియా వర్కర్లను పెంచి పటిష్టంగా చర్యలు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రజలకు డోర్ టు డోర్ క్యాంపెయిన్ ద్వారా కాచిన తాగునీటిని తాగాలని, ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను వారానికి ఒకసారి బ్లీచింగ్‌తో పరిశుభ్రపరచాలని, కేవలం వేడిగా ఉన్న ఆహారాన్నే తీసుకోవాలని, తినే పదార్థాలను పరిశుభ్రమైన చేతులతో పట్టుకోవాలని, మరుగుదొడ్లు వినియోగించుకున్న తర్వాత చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలన్న విషయాలపై హెల్త్ సెక్రటరీస్‌తో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, శివరామకృష్ణ, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ పి.రత్నావళి, ఎస్ఈ నరసింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ ఏఎస్ఎన్ ప్రసాద్, శ్రీనివాసరావు, సామ్రాజ్యం, వెంకటేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్స్ డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ రామకోటేశ్వరరావు, డాక్టర్ బాబు శ్రీనివాస్, బయాలజిస్ట్ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మస్క్యులర్ డిస్ట్రోఫీ పిల్లలకు అవకాశాలు కల్పించడమే లక్ష్యం

ఎఆర్‌డీఓ ప్రెసిడెంట్ శోభారాణి సుంకర

భవానీపురం(విజయవాడపశ్చిమ): మస్క్యులర్ డిస్ట్రోఫీ (కండరాల క్షీణత)తో పోరాడుతూ సమాజంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న పిల్లలు నేర్చుకునేందుకు, ఎదగటానికి, బాల్యంలో ఆనందాన్ని అనుభవించడానికి అవకాశాలను కల్పించటమే అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ (ఎఆర్‌డీఓ) లక్ష్యమని సంస్థ ప్రెసిడెంట్ శోభారాణి సుంకర తెలిపారు. భవానీపురంలోని హరిత బరం పార్క్‌లో శుక్రవారం ఎఆర్‌డీఓ వార్షిక సమావేశం జరిగింది. ఇందులో ఇంటరాక్టివ్ లెర్నింగ్ సెషన్స్, ఆటలు, వినోదం కలిగించటం, పిల్లల ప్రత్యేక అవసరాలు, సామర్థ్యాలకు అనుగుణంగా కళ, క్రాఫ్ట్ వర్క్‌షాప్, కథలు చెప్పే సెషన్, సంగీతం వంటి అనేక కార్యకలాపాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి సుంకర మాట్లాడుతూ మస్క్యులర్ డిస్ట్రోఫీ పిల్లల్లో సంకల్పం నింపి చైతన్యపరచటమే ఈ వార్షిక సమావేశం ఉద్దేశమన్నారు. అహ్లాదకరమైన వాతావరణంలో బ్రైట్ బిగినింగ్ ఎడ్యుకేషన్ వార్షిక సమావేశాన్ని ఏర్పాటు చేయడం పిల్లల సాధారణ జీవితాల నుంచి బయటపడటం కోసమేనని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ జగదీష్ బాబు (బయోఫోర్ ఇండియా ఫార్మాస్యూటికల్స్ సీఈఓ) మస్క్యులర్ డిస్ట్రోఫీ పిల్లల్లో ఆరుగురికి ఎలక్ట్రికల్ బ్యాటరీ వీల్ చైర్స్ అందించి తమ సహృదయాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో జనసేన నేత అమ్మిశెట్టి వాసు, దొడ్డ శ్రీనివాసరావు , ఐకాన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్లు యడ్ల పార్థసారథి, రాజేంద్ర, మిమిక్రి ఆర్టిస్ట్ గోపి, మెజీషియన్ క్రాంతికార్, మానవత సంస్థ ప్రెసిడెంట్ ఇమ్మనేని కృష్ణప్రసాద్, స్పృహాస్తి ట్రస్ట్ సభ్యురాలు భారతిదేవి, ఎఆర్‌డీఓ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



వీల్ చైర్లు అందుకున్న మస్క్యులర్ డిస్ట్రోఫీ పిల్లలతో అతిథులు, ఏఆర్‌డీఓ సభ్యులు

వీఎంసీ ప్రత్యేక కమిటీలు సమావేశం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో జరగాల్సిన పలు అభివృద్ధి పనులపై వీఎంసీ ప్రత్యేక కమిటీలు శనివారం సమావేశాలు నిర్వహించింది. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరం భవనంలో ఉన్న హాలులో రోడ్లు అభివృద్ధి, డ్రెయిన్ల అభివృద్ధికి ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ సభ్యుల సమావేశంలో మొత్తం 35 అంశాలు ప్రతిపాదన రాగా అందులో 17 అంశాలను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. 10 అంశాలకు ఆఫీస్ రిమార్కులకు పంపగా రెండు అంశాలు పని పూర్తయ్యిందని, ఒక అంశం వాయిదా వేయగా, 1 అంశం పనిజరుగుతుందని, మూడు అంశాలు పనులు పూర్తయ్యాయని సభ్యులు తీర్మానం చేశారు. ట్రాఫిక్ అండ్ స్పోర్ట్స్ కమిటీ నిర్వహించిన సమావేశంలో మొత్తం 13 అంశాలు ప్రతిపాదన రాగా అందులో 9 అంశాలు ఆమోదం పొందాయి. రెండు అంశాలు ఆఫీస్ రిమార్కులకు పంపగా ఒక అంశం వాయిదా వేశారు. ఒక అంశాన్ని తర్వాత సమావేశంలో ప్రతిపాదించాల్సినగా సభ్యులు తీర్మానం చేశారు.

క్లుప్తంగా

రేపటి నుంచి 30 పోలీస్ యాక్ట్ అమలు

విజయవాడస్పోర్ట్స్: శాంతి భద్రతలను పరిరక్షించేందుకు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో 30 పోలీస్ యాక్ట్ నిషేధాజ్ఞలను జూలై ఒకటో తేదీ సోమవారం నుంచి అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు 92 రోజుల పాటు ఈ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్న రోజుల్లో కమిషనరేట్ పరిధిలోని సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నా కార్యక్రమాలను ముందస్తు పోలీసు అనుమతి లేకుండా నిర్వహించడం నేరమన్నారు. నిషేధాజ్ఞలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పన్ను చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్లు

పటమట(విజయవాడతూర్పు): నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో నగరవాసులు చెల్లించాల్సిన ఆస్తి, నీటి, డ్రైనేజీ, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ సంవత్సరం పూర్తవుతున్నందున పన్ను చెల్లింపుదారులకు సౌకర్యార్థం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయన్నారు. ఈ నెల 30వ తేదీలోగా పన్ను చెల్లింపులు చేయనిపక్షంలో 2 శాతం అపరాధ రుసుం విధిస్తామని పేర్కొన్నారు. చెల్లింపుదారులు చెక్‌లు, డీడీలు, నగదు చెల్లింపులకు నగరంలోని మూడు సర్కిళ్లలో ఉన్న క్యాష్ కౌంటర్లలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు స్వీకరిస్తారని తెలిపారు. ఈ సౌకర్యాన్ని పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోవాలని కోరారు.

దుర్గమ్మకు కళాకారుల నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బెంగళూరుకు చెందిన పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. వైష్ణవి నాట్యశాల ట్రస్ట్‌కు చెందిన పలువురు చిన్నారులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను కట్టి పడేసింది. పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేసే భవానీపురం హెడ్‌వాటర్‌వర్క్స్‌లో 11 ఎంజీడీ వాటర్ సంపు శుభ్రం చేస్తున్నందున ఈ ప్లాంట్ నుంచి విడుదలయ్యే తాగునీటి సరఫరాను నిలిపేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దికర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్లాంట్‌ను జూలై 1వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిలిపేస్తున్నామన్నారు.

నీటి సరఫరా నిలిపే ప్రాంతాలు....

లారీస్టాండ్, ప్రియదర్శిని కాలనీ, హెచ్‌బీ కాలనీ-1, హెచ్‌బీ కాలనీ-2, రామరాజ్యనగర్, ఫోర్‌పిల్లర్ సెంటర్, బ్రహ్మంగారి మఠం -1, బ్రహ్మంగారి మఠం-2, టీనర్‌పేట, లంబాడీపేట కొండప్రాంతం, సొరంగం ప్రాంతం, ఊర్మిళా సుబ్బారావు నగర్, జక్కంపూడి హౌసింగ్ కాలనీ, గొల్లపాలెం గట్టు, చిట్టినగర్, ప్రైజర్‌పేటలో రిజర్వాయర్ల నుంచి నీటి సరఫరా నిలుపుతారు. కేఎల్‌రావు నగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, నాగమ్మ సత్రం, నైజాం గేటు, సౌమ్య థియేటర్ ప్రాంతం, ఫోర్‌మెన్ బంగ్లా, మిల్క్ ప్రాజెక్ట్ కొండప్రాంతం, వించిపేట, సితార, రామరాజ్యనగర్ బూస్టర్, ఏకలవ్య నగర్, వెల్లంపల్లి కాలనీ, ఐరన్‌యార్డ్, లక్ష్మీనగర్ కాలనీ, నులకపేట, దర్గా ఏరియాలో నీటి సరఫరా నిలిచిపోతుంది.

నేడు నీజెన్ డయాగ్నోస్టిక్స్ ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ రామ్ ప్రకాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): అత్యున్నత శ్రేణి డయాగ్నోస్టిక్ సేవలు అందించేందుకు ప్రకాశం రోడ్డులో ఏర్పాటు చేసిన నీజెన్ డయాగ్నోస్టిక్స్‌ను ఆదివారం ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రామ్ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం లబ్బీపేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అక్కడ అందించే సేవలను వివరించారు. నీజెన్‌లో డయాగ్నోస్టిక్స్ స్పెషాలిటీ ల్యాబ్స్, జినోమిక్స్ రాష్ట్ర వైద్య రంగంలో నూతన అధ్యాయాన్ని ఆవిష్కరించనున్నాయన్నారు. వ్యాధి నిర్ధారణ, పరీక్షల ఫలితాలు రోజుల పాటు వేచిచూడాల్సిన అవసరం లేకుండా, అత్యాధునిక పరికరాలు, నిష్ణాతులైన వైద్యులు, పరిశోధకులు, క్లినికల్ బృందాలతో నీజెన్ ను తీర్చిదిద్దినట్లు తెలిపారు. నమూనాలు తీసుకున్న 24 గంటల్లో అన్ని రకాల రిపోర్టులు అందచేస్తామని చెప్పారు. జీనోమిక్స్ విభాగం ద్వారా జన్యు సంబంధిత విశ్లేషణలు జరపనున్నట్లు తెలిపారు. కాగా ఆదివారం పవర్ మెక్ ప్రాజెక్ట్ సీఎండీ సజ్జా కిషోర్ బాబు, రెయిన్ బో హాస్పిటల్స్ సీఎండీ రమేష్ కంచర్ల నీజెన్ డయాగ్నోస్టిక్స్ ను లాంఛనంగా ప్రారంభిస్తారని డాక్టర్ రామ్ ప్రకాష్ తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థులకు నేషనల్ అవార్డులు



భవానీపురం(విజయవాడ పశ్చిమ): నేషనల్ ఏరోనాటికల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) పోటీల్లో శ్రీచైతన్య స్కూల్ భవానీపురం బ్రాంచిలో చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థులకు జాతీయ అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు శ్రీచైతన్య విద్యా సంస్థల ఈజీఎమ్ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యావిధానంతోనే ప్రతి సంవత్సరం తమ స్కూల్ విద్యార్థులు ఈ పోటీలకు ఎంపికయ్యి అవార్డులు సాధిస్తున్నారని తెలిపారు. అదే విధంగా శ్రీచైతన్య టెక్నో కరిక్యులమ్ దేశంలో జరిగే అన్ని పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విధంగా ఉందన్నారు. ఎంత ఉన్నత చదువులు చదువుకున్నా స్కిల్ కమ్యూనికేషన్స్ లేకపోతే ఉద్యోగాలు రావని, విద్యార్థులకు ఆ దిశలో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ సత్యచిత్ర, ఆర్ఐ రామారావు, కో ఆర్డినేటర్ చక్రధర ప్రసాద్, డీన్ రంగారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్నకు దన్నుగా నిలబడదాం



మాట్లాడుతున్న ఆసిఫ్, చిత్రంలో పలువురు కార్పొరేటర్లు



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విలువలు, విశ్వసనీయతకు ప్రతీకగా నిలిచిన యువనేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమందరం దన్నుగా నిలబడదామని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షుడిగా రానున్న కాలంలో జగనన్న పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోగల ఎస్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం పశ్చిమ నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ వర్గాల దాడులకు భయపడవద్దని, ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో ప్రజలతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. టీడీపీ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, మహదేవు అప్పాజీ, బాపతిరెడ్డి కోటిరెడ్డి, యరడ్ల ఆంజనేయ రెడ్డి, ఎండీ ఇర్ఫాన్, ఎస్ పూర్ణచంద్రరావు, అర్షద్, యలకల చలపతిరావు, పార్టీ నేత పోతిన వెంకట మహేష్, పాత శివాలయం చైర్మన్ బొమ్ము మధు, ఎస్సీ నాయకులు బూదాల శ్రీను, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. 48వ డివిజన్ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం సీఐటీయు ఆధ్వర్యంలో కార్మికుల గేట్ మీటింగ్ నిర్వహించారు. ఫిబ్రవరి మాసం హెల్త్ అలవెన్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని, కార్మికులకు యూనిఫాం, కొబ్బరి నూనె, చెప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కార్మికులకు వారాంతపు సెలవులు అమలు చేయడంతో పాటు పని భారం తగ్గింపుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అరుదైన రొమ్ము క్యాన్సర్‌కు విజయవంతంగా చికిత్స

అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ సృజన జోగా

లబ్బీపేట(విజయవాడతూర్పు): తీవ్రస్థాయి రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న గుంటూరుకు చెందిన 42 ఏళ్ల మహిళకు విజయవంతంగా చికిత్స అందించినట్లు అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ సృజన జోగా తెలిపారు. ఆరు నెలలుగా కుడి రొమ్ములో క్యాన్సర్ కణితిలో ఇబ్బంది పడుతున్న మహిళ కుడి ఆక్సిల్లాలో తాకుతూ ఉండే శోషరస కణుపులను కలిగి ఉన్నట్లు తెలిపారు. తీవ్రస్థాయి స్టేజ్ 3 ట్రిపుల్ నెగటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ కారణంగా, తొలుత రోగి కణితిని తగ్గించడానికి, శస్త్ర చికిత్స అనంతరం పరిస్థితిని అంచనా వేయగానికి నియో అడ్జువాంత్ కీమోథెరపీ చేసినట్లు తెలిపారు. అనంతరం అల్ట్రాసౌండ్‌లో ఎలాంటి కణితి లేదని వెల్లడైనట్లు డాక్టర్ సృజన తెలిపారు. కాగా ఇటీవల రోగి కుడిరొమ్ముకు మాడిఫైడ్ రాడికల్ మాస్టెక్టమీని చేయించుకున్నారని పేర్కొన్నారు. శస్త్ర చికిత్స అనంతరం నివేదికలో ఎలాంటి అవశేష కణితి లేదని సూచించినట్లు తెలిపారు. ఇది రోగి కోలుకోవడానికి బలమైన సూచికగా పేర్కొన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించి అధునాతన విధానాన్ని అనుసరించడంలో ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా విజయవతంగా చికిత్స చేసినట్లు తెలిపారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): అన్నార్తుల ఆకలిదప్పులు తీర్చే అదృష్టం కలగటం పూర్వజన్మ సుకృతమని ప్రముఖ ఆధ్యాత్మిక, సామాజికవేత్త, లయన్స్ డిస్ట్రిక్ట్ అంబాసిడర్, న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో కొత్తమాసు రామకుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని ద్వారావతి ఫౌండేషన్ సౌజన్యంతో శనివారం చిట్టినగర్‌లోని కుండల మార్కెట్ వద్దగల వీరాంజనేయ స్వామి దేవాలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హజరత్తయ్య గుప్తా అన్న ప్రసాద వితరణను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో సేవా సంస్కారాన్ని అలవరచాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ డి.రమణ బాబు, జిల్లా మాజీ గవర్నర్ దుర్గా మల్లేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు కె రామలింగేశ్వరరావు, కోశాధికారి రామకృష్ణ, అమృతవల్లి, కొత్త సుబ్బారావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ శివనాథ్‌కు సత్కారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని)కి అభినందన సత్కారం జరిగింది. పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసి విజయవాడ వచ్చిన ఎంపీ చిన్నీని రథం సెంటర్ వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఎదురేగి స్వాగతం పలికారు. అక్కడ నుంచి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న నివాసం వరకు భారీ ర్యాలీతో తీసుకువెళ్లారు. కేశినేని శివనాథ్(చిన్ని)ను సాదరంగా ఆహ్వానించిన బుద్దా వెంకన్న ఆయన్ను గజమాలతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. టీడీపీ నాయకులు నాగుల్‌మీరా, చెన్నుపాటి శ్రీను, ఉమ్మడి చంటి, పత్తి నాగేశ్వరరావు, రవీంద్ర, కె.హనుమంతరావు, వీరబాబు తదితరులున్నారు.

బందరు కాలువ బాగు చేయరూ ?



బెజవాడలోని ప్రధానమైన బందరు కాలువ చెత్తా చెదారంతో నిండిపోయింది. ఎటుచూసినా వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. ప్లాస్టిక్ వస్తువులు నీటిపై తేలాడుతూ కన్పిస్తున్నాయి. బస్టాండ్ సమీపంలోని కాల్వలో అపరిశుభ్రంగా చెత్తతో నిండిపోయిన చిత్రమిది.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com





